పార్కుల నిర్వహణ గాలికి

- కళావిహీనంగా మారుతున్న వైనం
- దెబ్బతింటున్న పరికరాలు
- పట్టించుకోని కార్పొరేషన్ అధికారులు

నెల్లూరు(బారకాసు): పని ఒత్తిడిలో తలమునకలయ్యే నగర వాసులు ఆహ్లాదకరమైన వాతావరణంలో గడిపేందుకు ఇష్టపడుతుంటారు. పాఠశాలల సెలవు రోజుల్లో ఆటలాడుకుంటూ కొంత సమయం పార్కుల్లో గడిపేందుకు చిన్నారులు ఆసక్తి చూపుతుంటారు. ఈ క్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ, నుడా ఆధ్వర్యంలో నగరంలో 82 పార్కులను ఏర్పాటు చేశారు. ఒక్కో పార్కుకు దాదాపు రూ.20 లక్షలకుపైగా వెచ్చించి ఎంతో సుందరంగా తీర్చిదిద్దారు. అయితే ఆయా పార్కుల నిర్వహణను కొద్ది రోజులే సక్రమంగా నిర్వహించారు. అనంతరం పట్టించుకునే నాథుడే కరువయ్యారు. దీంతో కొన్ని మినహా సింహభాగం పార్కులు అధ్వానంగా మారాయి.

దుర్భరంగా మారిన వైనం

నగరంలోని సత్యనారాయణపురం.. మినీబైపాస్ రోడ్డులోని ఎన్టీఆర్.. కలెక్టర్ కార్యాలయం ఎదురుగా ఉన్న మహబూబ్‌ఖాన్.. తదితర పార్కుల నిర్వహణను పట్టించుకోకపోవడంతో అందులో పిచ్చిమొక్కలు పెరిగి కళావిహీనంగా తయారయ్యాయి. దీంతో ఇక్కడికి రావాలంటేనే ప్రజలు జంకుతున్నారు. పిచ్చి మొక్కల్లో పాములు, విషపురుగులుంటాయనే భయంతో తమ పిల్లలకు పంపేందుకు తల్లిదండ్రులు భయపడుతున్నారు.



మాగుంట లేఅవుట్లోని ఎన్టీఆర్ పార్కులో పెరిగిన పిచ్చిమొక్కలు

ధ్వంసమైన పరికరాలు

పార్కుల నిర్వహణపై కార్పొరేషన్ అధికారులు ఏ మాత్రం శ్రద్ధ చూపడంలేదు. పార్కుల్లో శుభ్రం చేసే పరిస్థితే లేదు. పలు చోట్ల మొక్కలు ఎండిపోయాయి. కొందరు మందుబాబులు రాత్రి వేళ ఇక్కడికి చేరుకొని మద్యం సేవిస్తున్నారు. సిమెంట్ బెంచీలు ధ్వంసమైనా, వాటిని బాగు చేసే దిశగా చర్యలు చేపట్టడంలేదు. ఆట వస్తువులు, వ్యాయామ పరికరాలు మరమ్మతులకు గురవడంతో పార్కులకు వచ్చే వారు తగ్గుముఖం పట్టారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా..

పలు పార్కుల్లో వాచ్‌మెన్లు లేరు. దీంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా కొందరు మార్చుకుంటున్నారు. మద్యం, గంజాయి సేవిస్తూ అల్లరి చేస్తూ స్థానికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. పోలీసులు పట్టించుకోకపోవడంతో వీరి ఆగడాలు అధికమవుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

మంత్రి ఆదేశాలు బేఖాతర్

ప్రజలకు ఉపయోగపడేలా పార్కులను తీర్చిదిద్దాలని.. ఎలాంటి లోపాల్లేకుండా తరచూ పర్యవేక్షించాలని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ ఇటీవల ఆదేశించారు. అయితే ఆయన ఆదేశాలను కార్పొరేషన్ అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. సంబంధిత అధికారులు ఇప్పటికైనా పార్కులపై ప్రత్యేక దృష్టి సారించి వాటిని సక్రమంగా నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.



అస్తవ్యస్తంగా క్రీడా పరికరాలు



ఏపుగా పెరిగిన గడ్డి

ఘనంగా కళా నీరాజనం



రియాజ్‌బాషాను సత్కరిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(బృందావనం): శుభమస్తు షాపింగ్ మాల్ వ్యవస్థాపకుడు బయ్యా వెంకటరమణయ్య, సరోజనమ్మ స్మృత్యర్థం నగరంలోని పురమందిరంలో కళా నీరాజనాన్ని ఏవీకే ఫౌండేషన్ నిర్వాహకుడు కేతా సుబ్బారావు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బయ్యా శ్రీనివాసులు, వెంకటరవికుమార్, అరిగెపూడి విజయకుమార్ సౌజన్యంతో కార్యక్రమాన్ని చేపట్టామని వివరించారు. అనంతరం రియాజ్‌బాషాను సత్కరించి సేవారత్న పురస్కారాన్ని అందజేశారు. సిద్ధేంద్రయోగి కూచిపూడి కళాక్షేత్ర నిర్వాహకుడు డేగల సాంబశివరావు శిష్య బృంద ఆధ్వర్యంలో 100 మంది కళాకారులు ప్రదర్శించిన శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు అలరించాయి.

నృత్య, పాటల పోటీల్లో ప్రతిభ చూపిన వారికి బహుమతులు, ప్రశంసపత్రాలు, జ్ఞాపికలను అందజేశారు. వాకాటి విజయకుమార్‌రెడ్డి, మెట్టు రామచంద్రప్రసాద్, నలుబోలు బలరామయ్యానాయుడు, పోలేపల్లి శ్రీనివాసులు, పేరూరి ప్రదీప్, రమణారెడ్డి, రమణయ్య, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

3 నుంచి శరన్నవరాత్రి మహోత్సవాలు



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(బృందావనం): బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో సీతాదేవి శరన్నవరాత్రి మహోత్సవాలను అక్టోబర్ మూడు నుంచి 12 వరకు నిర్వహించనున్నామని మందిర కమిటీ ఉపాధ్యక్షుడు వెంకటసత్యనారాయణ తెలిపారు. కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను బాలాజీనగర్‌లోని వాకాటి నరసయ్య త్యాగరాజ కల్యాణ మండపంలో ఆదివారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. పంచామృతాభిషేకాలు, లక్ష్మీహోమం, సీతా మహాలక్ష్మి హోమం, లక్ష్మీ ఆరాధన తదితర పూజా కార్యక్రమాలను రోజూ నిర్వహించనున్నామని చెప్పారు. అమ్మవారు రోజూ విశేషాలంకారాల్లో దర్శనమివ్వనున్నారని, భక్తులు తరలిరావాలని కోరారు. మందిర కమిటీ ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటరత్నం, కోశాధికారి తన్నీరు మస్తాన్‌రావు, సహాయ కార్యదర్శులు అమరా మోహన్‌రావు, స్వామి పూర్ణచంద్రరావు, ప్రసన్నాంజనేయులు, కల్యాణ మండప కమిటీ కోశాధికారి శ్రీరామ్ వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

కాకాణిని కలిసిన రంగారెడ్డి



నెల్లూరు(బారకాసు): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని డైకస్‌రోడ్డులోని ఆయన నివాసంలో విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి మర్యాదపూర్వకంగా ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. పార్టీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి హరిబాబుయాదవ్, మాజీ ఏఎంసీ చైర్మన్లు పేర్నేటి కోటేశ్వరరెడ్డి, ఎంబేటి ఏసునాయుడు, ఏపీ స్టేట్ ఎమ్మెస్సెమ్ఈ మాజీ డైరెక్టర్ పాశం శ్రీనివాస్, పార్టీ మైనార్టీ నేత మొయినుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఏడాదిలో ప్రభుత్వ మార్కు చూపుతాం



కరపత్రాలను అందజేస్తున్న నారాయణ, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు సిటీ: ప్రజలు కొంచెం ఓపికపడితే ఏడాదిలో కూటమి ప్రభుత్వ మార్కును చూపుతామని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ పేర్కొన్నారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా నగరంలోని 40వ డివిజన్లో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డితో కలిసి కరపత్రాలను ఆదివారం పంపిణీ చేశారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నెస్సెస్ వలంటీర్ల సేవలు అభినందనీయం



నెల్లూరు(అర్బన్): ఎన్నెస్సెస్‌లో చేరి సేవా దృక్పథంతో విద్యార్థులు చేపడుతున్న కార్యక్రమాలను ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ కామేశ్వరి అభినందించారు. చింతారెడ్డిపాళెంలోని యలమవారిదిన్నెలో గల పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పలువురు రోగులకు వైద్యసేవలను కళాశాలకు చెందిన నర్సింగ్ విద్యార్థినులతో కూడిన ఎన్నెస్సెస్ యూనిట్ ఆదివారం నిర్వహించింది. అనంతరం స్వచ్ఛభారత్ ద్వారా ఆరోగ్య కేంద్ర ఆవరణలోని పిచ్చి మొక్కలు, గడ్డిని తొలగించారు. ప్రోగ్రామింగ్ ఆఫీసర్ డాక్టర్ ప్రసూనకుమారి, బీఎస్సీ నర్సింగ్ హెచ్‌ఓడీ వసుంధర, స్థానిక నేతలు శ్రీనయ్య, శరత్‌బాబు, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

అవయవదానంపై అవగాహన



నెల్లూరు(బృందావనం): అవయవదానంపై అవగాహన సదస్సును పొదలకూరు రోడ్డులోని జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో జిల్లా ప్రజావాకర్స్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వాకర్స్ సంఘ అధ్యక్షుడు మెట్టు సుధాకర్‌రెడ్డి మాట్లాడారు. పినాకినీ, సింహపురి దేహ సమర్పణ సంస్థల నిర్వాహకులు తిక్కవరపు సుకుమార్‌రెడ్డి, భారతి, మెట్టు సృజన, చెంచయ్య, ఆదిలక్ష్మి, డాక్టర్ దినకర్, రాజగోపాల్, కమలాకర్, సావిత్రి, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖలో భారీగా బదిలీలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ పరిధిలో నాలుగేళ్లు ఒకే చోట విధులు నిర్వర్తిస్తున్న విద్యుత్ సిబ్బందితో పాటు అధికారులను బదిలీ చేస్తూ ఉత్తర్వులను ఎస్ఈ విజయన్ ఆదివారం జారీ చేశారు. జిల్లాకు చెందిన 38 మంది ఏఈలు, 12 మంది జేఈలు, నలుగురు జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్లు, 12 మంది సీనియర్ అసిస్టెంట్లు, 26 మంది జూనియర్ అసిస్టెంట్లు బదిలీ అయ్యారు.

- హరనాథపురం ఏఈ దామోదర్‌ను బీవీనగర్‌కు.. స్టోన్‌హౌస్‌పేట ఏఈగా సుకుమార్‌ను టీపీగూడూరుకు.. రామ్మూర్తినగర్‌లో పనిచేస్తున్న ప్రసాద్‌ను కన్‌స్ట్రక్షన్స్‌కు.. రాజేంద్రనగర్‌లో పనిచేస్తున్న గోపీని సిటీ మీటర్స్‌కు.. వెంకటాచలంలో పనిచేస్తున్న తిరుపతయ్యను కమర్షియల్‌కు.. ముత్తుకూరులో పనిచేస్తున్న రామ్‌ప్రసాద్‌రెడ్డిని సిటీ మీటర్స్‌కు.. కన్‌స్ట్రక్షన్‌లో పనిచేస్తున్న పెంచలప్రతాప్‌ను కోడూరుకు బదిలీ చేశారు.

దొంగ అరెస్ట్

- ఆటో, బైక్ స్వాధీనం

నెల్లూరు(క్రైమ్): వాహన దొంగతనాలకు పాల్పడుతున్న ఓ పాతనేరస్తుడ్ని బాలాజీనగర్ పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల మేరకు.. జగదీష్‌నగర్‌లోని బ్యాంక్ కాలనీలో గల ఓ అపార్ట్‌మెంట్ వద్ద నిలిపి ఉన్న ఆటో ఈ నెల 16న అపహరణకు గురైంది. ఆటో యజమాని ఫిర్యాదు మేరకు పోలీసులు అప్పట్లోనే కేసు నమోదు చేశారు. ఘటన స్థలంలో లభ్యమైన సీసీ ఫుటేజీల ఆధారంగా కొత్తూరు రామకోటయ్యనగర్‌కు చెందిన పాతనేరస్తుడైన హుస్సేన్ అలియాస్ ఉస్మాన్‌ను నిందితుడిగా గుర్తించి గాలింపు చర్యలను చేపట్టారు. ఈ క్రమంలో నిందితుడ్ని అదుపులోకి తీసుకొని తమదైన శైలిలో విచారించగా, ఆటోతో పాటు గౌడ హాస్టల్ సెంటర్‌లో స్ప్లెండర్ బైక్‌ను చోరీ చేశానని అంగీకరించారు. దీంతో నిందితుడ్ని అరెస్ట్ చేసి ఆటో, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై బాలాజీనగర్ పోలీస్‌స్టేషన్లో సస్పెక్టెడ్ షీటు ఉందని ఇన్‌స్పెక్టర్ సాంబశివరావు తెలిపారు.

వరద బాధితులకు విరాళం

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): విజయవాడ వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయనిధికి రూ.మూడు లక్షల సాయాన్ని వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రకటించారు. ఈ మేరకు ఈ మొత్తానికి సంబంధించిన డీడీని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి ఆదివారం అందజేశారు. అధ్యక్షుడు సుబ్బరాజు, కార్యదర్శి స్వర్ణ రమేష్‌బాబు, కోశాధికారి జయదేవ్, వాకర్స్ మాజీ గవర్నర్ రాఘవేంద్రశెట్టి, డాక్టర్ అంకిరెడ్డి, చింతల అమరేంద్రరెడ్డి, పొన్నం రవిచంద్ర, గఫార్, కేఎమ్కే రెడ్డి, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై అర్జీలను అందజేయండి

నెల్లూరు(బారకాసు): నగరంలో నెలకొన్న సమస్యలపై అర్జీలను ప్రజలు అందజేయాలని కమిషనర్ సూర్యతేజ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం ఉదయం పది నుంచి మధ్యాహ్నం వరకు నిర్వహించనున్నామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఘన సన్మానం

నెల్లూరు(బృందావనం): ప్రముఖ నటుడు అక్కినేని నాగేశ్వరరావు శత జయంత్యుత్సవాల్లో భాగంగా నెల్లూరుకు చెందిన కటౌట్ల ఆర్టిస్ట్ ఆంథోనీని ఆదివారం సత్కరించారు. అక్కినేని అభిమానులు బొగ్గవరపు శ్రీమన్నారాయణ, బాబు, మురళీమోహన్‌రావు, అంజద్‌బాషా, కుమారమంగళం, రాము తదితరులు పాల్గొన్నారు.

వనంతోపు, కాకుపల్లిలో విషాదఛాయలు

నెల్లూరు(క్రైమ్): తిరుపతి జిల్లా చిల్లకూరు జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదం నెల్లూరు నగరంలోని వనంతోపు, కాకుపల్లి ప్రాంతాల్లో విషాదాన్ని నింపింది. ప్రమాదంలో తాతా, మనవరాలు బాబు (50), వెన్నెల, జగదీష్ మృతితో ఆయా కుటుంబాలు రోదిస్తున్నాయి. గాయపడిన వారు నెల్లూరులోని ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు.

ఎస్టీ వర్గీకరణకు ఉద్యమం చేపట్టాలి



మాట్లాడుతున్న పెంచలయ్య

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఎస్టీ వర్గీకరణతోనే యానాదులకు న్యాయం జరుగుతుందని, దీనికి ఉద్యమాలను చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని యానాది సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ తీర్మానించింది. నగరంలోని గిరిజన భవన్‌లో యానాది సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. పెంచలయ్య, కుడుముల రామచంద్రయ్య, బాపట్ల వెంకటపతిని త్రిసభ్య కమిటీ సభ్యులుగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా పెంచలయ్య మాట్లాడారు. విజయవాడలో వచ్చే నెల్లో సమావేశమై, ఉద్యమ కార్యాచరణపై చర్చించనున్నామని వివరించారు. నేతలు శ్రీనివాసులు, రామచంద్రయ్య, సుబ్బారావు, సరస్వతమ్మ, ఉషా తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్యారమ్స్ పోటీలు



నెల్లూరు (టౌన్): నగరంలోని అన్నమయ్య సర్కిల్ సమీపంలో జిల్లా స్థాయి క్యారమ్స్ పోటీలను యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. పురుషుల విభాగంలో బోగోలు మండలం నుంచి వెంకటశేషాద్రి, గుడ్లూరు మండలం నుంచి సుబ్బారావు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. మహిళా విభాగంలో కోవూరు మండలం నుంచి ప్రసూన, నెల్లూరు రూరల్ నుంచి వహీదాబేగం మొదటి రెండు స్థానాలను సాధించారు. న్యాయనిర్ణేతలుగా పీడీలు నాగయ్య, శ్రీనివాసులు వ్యవహరించారు. యూటీఎఫ్ నేతలు చలపతిశర్మ, అచ్చయ్య, మురళీధర్‌రావు, నాగిరెడ్డి, ఖాజావలీ, బాలరాగయ్య, మధుసూదన్‌రావు, సురేంద్రబాబు, జమీర్ అహ్మద్, రియాజ్ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి చేయూత



నెల్లూరు(వీఆర్సీసెంటర్): వెంకటేశ్వరపురంలో నివాసం వుంటున్న దివ్యాంగుడు బిర్జుబాయ్ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. ఈ క్రమంలో వారి కుటుంబపోషణ కష్టతరంగా మారింది. విషయం తెలుసుకున్న బ్లాక్‌బోర్డు మిత్రమండలి, దివ్యాంగుల ఐక్య సంఘ నేతలు వారి కుటుంబానికి నెలకు సరిపడా బియ్యం, నిత్యావసర సరుకులను ఆదివారం అందజేశారు. నరసాపురం ప్రసాద్, సనావుల్లా, జక్కావుల్లా, నిర్మల, మున్నా తదితరులు పాల్గొన్నారు.

సమాజ సంక్షేమానికి సాహిత్యం తోడ్పడాలి



కథాసంపుటి ఆవిష్కరణ

నెల్లూరు(బృందావనం): సమాజ సంక్షేమానికి సాహిత్యం తోడ్పడాలని తెలుగు సాహితీ వ్యవస్థాపకురాలు శాంతికృష్ణ పేర్కొన్నారు. సందడి అరుణ రాసిన ఆత్మీయ బంధాలు కథా సంపుటి ఆవిష్కరణ, పరిచయ సభను పొగతోటలోని ఆదిశంకర ధ్యాన మందిరంలో నెల్లూరు జిల్లా రచయితల సంఘ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. అనంతరం రచయిత్రిని అభినందించారు. రచయితల సంఘ జిల్లా అధ్యక్షుడు జయప్రకాష్, గంగిశెట్టి శివకుమార్, నజ్మా, తన్నీరు శశికళ, శ్రీధర్‌బాబు, భారతి, కోదండరామయ్య, విశ్వేశ్వరప్రసాద్, నరసింహం, రసూల్, మోహన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

చెస్ టోర్నీ ప్రారంభం



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): మైపాడు గేట్ సెంటర్ సమీపంలోని కేపీఆర్ కల్యాణ మండపంలో వైవీ రమణారెడ్డి తృతీయ స్మారక ఆలిండియా ఓపెన్ చెస్ పోటీలను ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రారంభించారు. పోటీలు ఏడు రౌండ్లలో జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. రేడియాలజిస్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ కార్యదర్శి డాక్టర్ ఉమామహేశ్వరరెడ్డి, చెస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుమన్, చెస్ అసోసియేషన్ కృష్ణా, వైఎస్సార్ జిల్లాల కార్యదర్శులు దేవరం శ్రీహరి, అనీస్, టోర్నీ డైరెక్టర్లు వెంకటేష్, డాక్టర్ మధుసూదన్, వారధి అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రంగనాథ్, ఆర్కాట్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వర్షంతో ఊరట



నెల్లూరు(దర్గామిట్ట): ఉక్కపోతతో అల్లాడిన ప్రజలు ఆదివారం కురిసిన వర్షంతో ఉపశమనం పొందారు. నగరంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం మధ్యాహ్నం కురిసింది. వాహనదారులు కొంత ఇబ్బంది పడ్డారు.

నేరస్తులపై కఠినంగా వ్యవహరించాలి



మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి

నెల్లూరు(క్రైమ్): నేరస్తులపై కఠినంగా వ్యవహరించి ప్రజలకు మెరుగైన శాంతిభద్రతలను అందించాలని నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డి సూచించారు. నగరంలోని తన కార్యాలయంలో నగర ఇన్‌స్పెక్టర్లతో నెలవారీ నేర సమీక్ష సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. స్టేషన్ల వారీగా కేసుల వివరాలను అడిగి తెలుసుకున్న అనంతరం ఆయన మాట్లాడారు. రౌడీషీటర్లు, సస్పెక్టెడ్ల కదలికలపై నిఘా ఉంచాలని చెప్పారు. నేరాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, పగలు.. రాత్రి గస్తీని ముమ్మరం చేయాలని సూచించారు. దీపావళి సమీపిస్తున్న తరుణంలో బాణసంచా తయారీ కేంద్రాలు, గోదాములు, విక్రయ కేంద్రాల్లో రెవెన్యూ, అగ్నిమాపక శాఖలతో కలిసి తనిఖీలను చేపట్టాలని ఆదేశించారు. నిబంధనలు పాటించని వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టాలన్నారు. నగర ఇన్‌స్పెక్టర్లు చిట్టిం కోటేశ్వరరావు, అన్వర్‌బాషా, మద్ది శ్రీనివాసరావు, రోశయ్య, కిశోర్‌కుమార్, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన క్రాఫ్ట్స్ మేళా

కొడవలూరు: స్థానిక జెడ్పీ హైస్కూల్లో క్రాఫ్ట్స్ మేళాను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నైపుణ్యం అందర్నీ ఆకట్టుకుంది. కలర్ పేపర్లు, అట్టముక్కలు తదితరాలతో ఆకర్షణీయమైన బొమ్మలు, వస్తువులను విద్యార్థులు రూపొందించి ప్రదర్శనలో ఉంచారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు రవీంద్రబాబు మాట్లాడారు. బొమ్మలను తయారు చేయడం ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న కళానైపుణ్యం పెంపొందడంతో పాటు వారిలోని సృజనాత్మకత వెలుగులోకి వస్తుందని చెప్పారు. అనంతరం అద్భుతమైన కళా రూపాలను ప్రదర్శించిన వారికి బహుమతులను ఉపాధ్యాయులు రేఖారాణి, సుబ్బారావు, ఖాదర్‌బాషా, శ్రీనివాసులురెడ్డి, సుబ్రహ్మణ్యం, సత్యానంద, కవిత తమ సొంత నిధులతో అందజేశారు.

ప్రభుత్వ భూముల ఆక్రమణ సరికాదు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: నగర పంచాయతీ పరిధిలోని ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్, ఇరిగేషన్ శాఖలకు చెందిన భూమిని పలువురు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారని నగర పంచాయతీ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నగర పంచాయతీకి సంబంధించిన భూమి అని గోడపై రాసి ఉన్న అక్షరాలను గుర్తుతెలియని వ్యక్తులు చెరిపేశారని చెప్పారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి చర్యలు చేపడతామని తెలిపారు. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే ఉపేక్షించేదిలేదని స్పష్టం చేశారు.

క్రైస్తవ సంఘాల సమావేశం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పట్టణంలోని క్రైస్తవ సంఘాల పెద్దలు ఆదివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. క్రైస్తవుల హక్కుల పరిరక్షణకు సెల్‌ను ఏర్పాటు చేసే దిశగా చర్చలు జరిపామని వివరించారు. క్రైస్తవులపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా పోరాటం చేస్తామని తెలిపారు.

కోడి పందేల స్థావరాలపై దాడులు

కోవూరు: కోడి పందేల స్థావరాలపై పోలీసులు దాడులను ఆదివారం నిర్వహించారు. వివరాలు.. కోవూరులోని గుమ్మళ్లదిబ్బలో కోడిపందేలను నిర్వహిస్తున్నారనే సమాచారం పోలీసులకు అందింది. దీంతో సీఐ సుధాకర్‌రెడ్డి, ఎస్సై రంగనాథ్‌గౌడ్ తమ సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఆరు కోడి పుంజులతో పాటు ముగ్గురు పందెంరాయుళ్లు, ఆరు ద్విచక్రవాహనాలు, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేశారు.

అంకమ్మ తల్లికి పూజలు



విడవలూరు: స్థానిక అంకమ్మ తల్లి దేవస్థానంలో అమ్మవారికి విశేష పూజలను ఆదివారం నిర్వహించారు. అభిషేకం, కుంకుమార్చన తదితర పూజా కార్యక్రమాలను పూజారి గిరి ఆధ్వర్యంలో జరిపారు. అమ్మవారు మహంకాళిగా దర్శనమిచ్చారు. గ్రామంలోని మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని పొంగళ్లు పొంగించి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు.